సాక్షి బాపట్ల

గురువారం ౹ 12 ౹ సెప్టెంబర్ ౹ 2024



యార్డుకు 32,598 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 32,598 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,198 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



రూ. 2.65 లక్షలు పలికిన లడ్డూ

సత్తెనపల్లి: రామాలయం వద్ద వినాయక చవితి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వేలంపాటలో లడ్డూను రూ.2.65 లక్షలకు జి. రామారావు దక్కించుకున్నారు.

నాణేలతో గణపతికి అలంకరణ



అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని ఠాగూర్ పాఠశాల వద్ద బ్రాహ్మణ బజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం 1,00,016 రూపాయి నాణేలతో గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

14న జాతీయ లోక్ అదాలత్

మాచర్ల: హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన మాచర్ల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నర్సరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.ఆశీర్వాదం పాల్ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూనియర్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం మాచర్లలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాజీ పడదగిన కేసులన్నింటిని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగంగుంట్ల కాలనీ లడ్డూ రూ.1.4 లక్షలు



నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల కాలనీ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 23 సంవత్సరాలుగా కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా వేడుకలు కొనసాగుతున్నాయి. బుధవారం గణనాథుడికి నంద్యాల సత్యనారాయణరెడ్డి డాలర్ల దండ అందజేశారు. అలాగే 25 కిలోల లడ్డూ వేలం పాట జరిపారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలంలో టి.జయభారత్‌రెడ్డి రూ.1.4 లక్షలకు దక్కించుకున్నారు. మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన వేలంపాటలో చీమల అనిత రూ.16,100కు స్వామి లడ్డూ కైవసం చేసుకున్నారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఊరేగింపు సందడిగా సాగింది.

అటవీ అమరవీరులకు నివాళి




నరసరావుపేట రూరల్: జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి ఎన్.రామచంద్రరావు ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకుంటూ ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బలవంతంగా గణపతి విగ్రహం నిమజ్జనం

వైఎస్సార్ సీపీ వర్గీయులతో పోలీసుల అనుచిత వైఖరి

సాక్షి, నరసరావుపేట: వినాయక విగ్రహాల ఏర్పాటులో పోలీసులు పక్షపాత వైఖరి చూపుతున్నారని కారుమంచి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఆరోపించారు. శావల్యాపురం, కారుమంచి గ్రామంలో చవితి సందర్భంగా వేడుకల కోసం 11 రోజులపాటు అనుమతులు పొందామన్నారు. శావల్యాపురం ఎస్సై లోకేశ్వరరావు ఇక్కడి అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో విగ్రహాన్ని వెంటనే నిమజ్జనం చేయాలని నిర్వాహకులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి బెదిరించినట్లు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఎలాంటి డీజేలు, మేళతాళాలు లేకుండానే విగ్రహాన్ని బుధవారం ఉదయాన్నే నిమజ్జనం చేసినట్లు చెప్పారు. గ్రామంలో మిగిలిన మూడు విగ్రహాలు యథావిధిగా 11 రోజుల ఉత్సవాలకు ఉంచారని, తమతో మాత్రం బలవంతంగా ఇలా చేయించారని వాపోయారు. దేవుడి ఉత్సవాల్లో రాజకీయం మంచి సంస్కారం కాదన్నారు. 11 రోజులు అనుమతి ఇవ్వలేదని పోలీసులు ఇప్పుడు పేర్కొంటున్నారని నిర్వాహకులు ఎం.చెంచయ్య, పి.ఆదయ్య, రామాంజనేయులు, శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

రేపటి నుంచి నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: పట్టణంలోని ప్రసిద్ధ పానకాల లక్ష్మీ నృసింహస్వామి పవిత్రోత్సవాలను ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎ. రామకోటిరెడ్డి బుధవారం తెలిపారు. తొలి రోజు సాయంత్రం 4 గంటలకు అంకురారోహణతో ప్రారంభమై, చివరి రోజు పూర్ణాహుతి, శ్వేత పుష్ప గ్రామోత్సవంతో ఇవి ముగియనున్నట్లు పేర్కొన్నారు.

రూ.వెయ్యి కోట్లకుపైనే!

వరద నష్టం తేల్చారు.. తొలిగేనా కన్నీరు

- రూ. 453 కోట్ల మేర మునిగిన వరి సాగు
- ఉద్యాన రైతులకు రూ.129.42 కోట్ల వరకు దెబ్బ
- భారీగా నివాసాలు, రహదారులు ధ్వంసం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో ఇటీవల సంభవించిన వరదల వల్ల ప్రజలకు భారీ నష్టం వాటిల్లింది. గత నెల చివరిలో ఎగువన భారీవర్షాలు కురిసి కృష్ణా నదికి వరద ఉధృతి పెరగడంతో ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో సెప్టెంబర్ 1వ తేదీన కొల్లూరు మండలం అరవింద వారధి సమీపంలో కరకట్టకు గండి పడింది. కొల్లూరు మండలంలో 22, భట్టిప్రోలులో 4, రేపల్లె మండలంలో ఒక ఊరు చొప్పున మొత్తం 27 లంక గ్రామాలు నీట మునిగాయి. వరితోపాటు వాణిజ్య పంటలన్నీ నీటి పాలయ్యాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. సాగునీటి కాలువలకు గండ్లు పడటంతో చాలాచోట్ల లాకులు ధ్వంసమై కనిపించాయి. నీటిలో నాని వందల ఇళ్లు నేలకూలాయి. వరద నీటిలో విలువైన సామగ్రి కొట్టుకుపోయింది. మిగిలిన వస్తువులు నానడంతో పనికి రాకుండా పోయాయి. వేల కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

అన్నదాతకు కన్నీరే

వానలు, వరద తీవ్రతకు జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో ఉన్న 16 మండలాల పరిధిలో 32,771 మంది రైతులకు చెందిన 86,659 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. రూ. 453 కోట్ల మేర పంట నష్టం వాటిల్లిందని అధికారులు తేల్చారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో పసుపు, అరటి, కంద, తమలపాకు, జామ, బొప్పాయి, పూలు, కూరగాయలు తదితర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 8,468 మంది రైతులకు చెందిన 4,614.90 హెక్టార్లలో ఈ పంటలకు నష్టం వాటిల్లింది. రూ.129.42 కోట్ల మేర ఆర్థికంగా రైతులు చితికిపోయినట్లు అధికారులు తేల్చారు. కేవలం రూ.10.60 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రతిపాదించారు. రాష్ట్ర విపత్తుల విభాగం నిబంధనల మేరకు వాణిజ్య పంటలకు సంబంధించి హెక్టారు అరటికి రూ. 25 వేలు, కంద, పసుపునకు రూ.18 వేలు, నిమ్మకు రూ.22 వేలు, కూరగాయలకు రూ.18 వేలు, తమలపాకు రూ. 30 వేల చొప్పున ఎకరానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తారు. దీర్ఘకాలికంగా సాగులో ఉన్న వాణిజ్య పంటలకు పెట్టుబడి అధికంగా ఉంటుంది. ప్రభుత్వం మొక్కుబడిగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని విమర్శలు వస్తున్నాయి.



కొల్లూరు మండలం తడికలపూడి వద్ద వరదకు దెబ్బతిన్న వాణిజ్య పంటలు



కొల్లూరు మండలం కిష్కిందపాలెం రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ వద్ద ముంపులోనే ఇళ్లు

393 కి.మీ. రోడ్లు ధ్వంసం

రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని 393 కిలో మీటర్ల మేర రహదారులు వరద ప్రభావంతో దెబ్బతిన్నాయి. దీని వల్ల రూ. 478.77 కోట్ల నష్టం వాటిల్లింది. 7,943 గృహాలు నీట మునగడంతో రూ. 9.52 కోట్లు, 888 ఎకరాల్లో ఆక్వా సాగు దెబ్బతినడంతో రూ. 10.17 కోట్ల నష్టం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. 25 పాఠశాల భవనాలు దెబ్బతినడంతో రూ. 3.83 కోట్ల మేర నష్టం వాటిల్లింది. విద్యుత్ విభాగం పరిధిలో సబ్ స్టేషన్లు మునగడం, ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్ విరిగి పడడంతో రూ.1.17 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చింది. మొత్తంగా వరదల వల్ల జిల్లాకు రూ.1,085.46 కోట్ల నష్టం జరిగిందని అధికారులు తేల్చారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

దాడి ఘటనకు నిరసనగా ఏకమైన ఊరు



యద్దనపూడి: తమ గ్రామంలోని ఓ వ్యక్తిపై అమానుషంగా కత్తులు, ఇతర మారణాయుధాలతో ఐదుగురు హత్యాయత్నం చేసిన ఘటనపై గ్రామం మొత్తం ఏకమైంది. పార్టీలకు అతీతంగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఈ సంఘటన యద్దనపూడి మండలంలోని చిమటవారిపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ నెల 8వ తేదీన రాత్రి గ్రామంలోని వినాయక విగ్రహం వద్ద అన్నదానంలో పాల్గొని ఇంటికి వెళ్తున్న గనిపిశెట్టి శ్రీనివాసరావుపై అతడి సమీప బంధువులు ఐదుగురు పొలం వివాదానికి సంబంధించిన పాతకక్షలతో కత్తులు, ఇతర మారణాయుధాలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. గాయపడిన శ్రీనివాసరావు విజయవాడ మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విషమ పరిస్థితుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో దాడికి నిరసనగా దాదాపు 150 మంది గ్రామస్తులు బుధవారం యద్దనపూడి స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రశాంతంగా ఉండే తమ గ్రామంలో ఇలాంటి హింసాయుత ఘటనలు ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరారు. ఏదైనా వివాదాలు ఉంటే కోర్టుల ద్వారా గానీ, పెద్దల సమక్షంలోగానీ పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఇలా మనుషులను కడతేర్చాలనుకోవడం సహించరానిదన్నారు. నలుగుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కీలకమైన గండు వీరశంకరావునూ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సై రత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. గనిపిశెట్టి శ్రీను, వెంకయ్య, బాపారావు, వాసుబాబు, సుబ్బారావు, రమేష్, రామారావు, టంకసాల సుబ్బారావు, చెంచురామయ్య, ఇనకొల్లు గోపీకృష్ణ, తమ్మలూరి ప్రభుదాసు, రామిశెట్టి సుబ్బారావు, గనిపిశెట్టి వెంకాయమ్మ, టంకసాల విజయలక్ష్మి, శివపార్వతి, రుషేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగనాభిమానం

- గుంటూరు నగరంలో ఎగసిపడ్డ అభిమాన తరంగం
- అడుగడుగునా వైఎస్ జగన్‌కు జన నీరాజనం
- భారీ బైక్ ర్యాలీలతో కిక్కిరిసిన నగరం
- పెద్దఎత్తున స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు





గుంటూరు నగరంలోని అరండల్ పేట రోడ్డుపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో జనసందోహం, ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

పట్నంబజారు/నెహ్రూనగర్: జిల్లా జైలులో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు నగరానికి వచ్చిన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెంట వైఎస్సార్ సీపీ సైన్యం కదలివచ్చింది. అప్పటికే జిల్లా జైలు ప్రాంగణమంతా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. ఒకానొక దశలో అభిమానులు పోటెత్తడంతో అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది. అక్కడ నుంచి భారీ జనవాహిని నడుమ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎస్వీఎన్ కాలనీలో నివాసం ఉంటున్న క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి నివాసానికి బయలుదేరారు. అప్పటికే భారీగా చేరుకున్న పార్టీ కార్యకర్తలు, యువత, విద్యార్థులు భారీ బైక్ ర్యాలీతో ఆయన వెంట ముందుకు సాగారు.

కదలి వచ్చిన వైఎస్సార్ సీపీ సైన్యం

కాకాని రోడ్డు వై జంక్షన్ మీదుగా రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు, అమరావతిరోడ్డు, లాడ్జి సెంటర్ వైపుగా బుధవారం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా జైలు ప్రాంగణానికి చేరుకున్నారు. వై జంక్షన్ నుంచే భారీగా బైక్ ర్యాలీలు, కార్లతో వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేళంగిణినగర్ వద్ద పార్టీ శ్రేణులు భారీగా ఎదురేగి అభిమానాన్ని చాటారు. అమరావతి రోడ్డులో ఆలా ఆసుపత్రి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని విగ్రహం మండపం వద్ద మహిళలు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వాహనంపై పూలు జల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు.

లాడ్జి సెంటర్‌లో ఘన స్వాగతం

లాడ్జి సెంటర్‌లో పార్టీ క్యాడర్ స్వాగతం పలికింది. అక్కడ నుంచి కొరిటెపాడు ప్రధాన రహదారిలో చేరుకోగానే పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ బాణసంచా కాలుస్తూ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో ముందుకు కదిలారు. అక్కడ నుంచి గుజ్జనగుండ్ల చేరుకోగానే మహిళలు భారీ పూలవర్షం కురిపించారు. జగనన్నకు జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడ నుంచి ఎస్వీఎన్ కాలనీ నాలుగో లైనులో ఉన్న ఈదా సాంబిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. జిల్లా జైలు నుంచి ఎస్వీఎన్ కాలనీ చేరుకునే సరికి గంటన్నరకు పైగా పట్టిందంటే.. అభిమానులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలివచ్చిన తీరు అర్థమవుతుంది.



వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ యువకుల బైక్ ర్యాలీ

నినాదాలతో దద్దరిల్లిన గుంటూరు

గుంటూరు బైపాస్‌లోకి చేరుకున్న వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. వెల్లువెత్తిన పార్టీ శ్రేణులు, అభిమానంతో దూసుకెళ్లిన యువతతో ఆద్యంతం పర్యటన కొనసాగింది. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, పేర్ని నాని, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, సమన్వయకర్తలు షేక్ నూరిఫాతిమా, అంబటి మురళీకృష్ణ, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, బలసాని కిరణ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ ఆటవిక పాలనకు చరమగీతం తప్పదు

గుంటూరు ఎడ్యుకేషన్: టీడీపీ ఆటవిక పాలనకు చరమగీతం పలుకుదామని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి, శస్త్రచికిత్స అనంతరం రెండు నెలలుగా మంచానికే పరిమితమైన క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సాంబిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల్ని పేరు, పేరునా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పలుకరించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు ఆడపిల్లలు గల తమ కుటుంబం, ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న సాంబిరెడ్డి ప్రాణాలకు ఆపద రావడంతో తామంతా విలవిల్లాడిపోయామని ఈ సందర్భంగా ఆయన భార్య కన్నీటి పర్యంతరమయ్యారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి అనుచరులు, బంధువులు తమకు టీడీపీ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్న విషయాన్ని వైఎస్. జగన్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో అంతా వికలాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని వస్తున్న బెదిరింపులపై పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు వివరించారు. టీడీపీ దాడుల్ని సమర్థంగా ఎదుర్కొందామని, వారి దాడులకు భయపడేది లేదని వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

వందశాతం పంట నష్టం జరిగినట్టేనా?



కొల్లూరు మండలం సుగ్గునలంక వద్ద ముంపునకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



కేంద్ర బృందం వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న చింతర్లంక, పెదలంక డ్వాక్రా మహిళలు

- వివరాలు 8లో ▸

సీఎం వస్తున్నారంటూ పారిశుద్ధ్యంపై దృష్టి

రోడ్లు ఊడ్చి మరీ పరిసరాల పరిశుభ్రత

కొల్లూరు: కృష్ణా వరద ముంపు గ్రామాలలో పారిశుద్ధ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు సీఎం వస్తున్నారనే కారణంగా కాస్త ఊరట దక్కింది. సీఎం చంద్రబాబు నాయుడు మండలంలోని తడికలపూడి, కిష్కిందపాలెంలో వరద ముంపు నష్టాన్ని పరిశీలించడానికి రానున్నారనే సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇరు గ్రామాలను అద్దంలా మార్చేందుకు తాపత్రయ పడుతోంది. వారం క్రితం వరదలు తగ్గిన అనంతరం నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు చేపట్టిన పంచాయతీరాజ్ యంత్రాంగం.. ఇప్పుడు మాత్రం రహదారులను కార్మికులతో ఊడిపించింది. రోడ్డు పక్కనున్న మొక్కలు, గడ్డిని సైతం తొలగించే పనులను కార్మికులు చేపట్టారు. దీంతో వారి తీరు చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజల ఇబ్బందులు పట్టని అధికార యంత్రాంగం.. సీఎం వస్తున్నారనే కారణంగా ఆగమేఘాలపై పనులు చేపట్టడంతో తమపై ఏపాటి శ్రద్ధ ఉందో అర్థమవుతోందని ముంపు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



కొల్లూరు మండలం కిష్కిందపాలెంలో చిన్న మొక్కలు, గడ్డి కూడా తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

క్లుప్తంగా

వరద నీటిలోపడి వృద్ధుడు మృతి

- రేపల్లెకు చెందిన వ్యక్తిగా గుర్తింపు
- దక్షిణ చిరువోలులంక వద్ద శవమై తేలిన వైనం


మన్నే పూర్ణచంద్ర రావు(ఫైల్)

అవనిగడ్డ: రేపల్లెకు చెందిన మన్నే పూర్ణచంద్ర రావు (72) మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక వద్ద కృష్ణానదిలో శవమై తేలారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణచంద్రరావు మూడు రోజుల క్రితం మోపిదేవి గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటినుంచి వచ్చారు. దక్షిణ చిరువోలులంక వద్ద కృష్ణా నదిలో పూర్ణచంద్రరావు మృతదేహం కనబడగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని ఆధారాలను బట్టి బంధువులకు సమాచారం ఇవ్వగా దక్షిణ చిరువోలులంక చేరుకున్నారు. పంచనామా అనంతరం బుధవారం స్థానిక స్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. కాళ్లు కడుక్కునేందుకు పులిగడ్డ వార్పు వద్ద నదిలోకి దిగి ప్రమాదవశాత్తు నదిలో పడి మరణించి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

అద్దంకి రూరల్: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అద్దంకి పట్టణంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని సాయిబాబా దేవస్థానం వెనుక చిలకావారి వీధిలో నివాసం ఉంటున్న పురిబెళ్ల లక్ష్మీనారాయణ (30) అలియాస్ నాని స్థానిక బంగ్లా రోడ్ ఎదురుగా ఉన్న టీ స్టాల్‌లో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్ఐ ఖాదర్‌బాషా సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దు

జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: ప్రశాంతంగా ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో అశాంతిని సృష్టించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. అధికారం శాశ్వతం కాదని, మంచి చేసేవారినే ప్రజలు గుర్తుంచుకుంటారు తప్ప దాడులు చేసి కక్షలు, కార్పణ్యాలకు పాల్పడేవారిని క్షమించారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించకూడదా అన్ని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు సృష్టించిన అలజడుల వలనే తుఫాన్ వలన మృతి చెందిన సంగ్రతండాకు చెందిన వ్యక్తిని మాజీ ఎమ్మెల్యే శంకర రావు పరామర్శించలేకపోయారని పేర్కొన్నారు. దాడులకు స్వస్తి చెప్పి శాంతియుత వాతావరణంలో ప్రజలు స్వేచ్ఛగా జీవనం కొనసాగించేందుకు సహకరించాలని కోరారు.


'మొక్క'వోని ఆశ: తడికలపూడి పంచాయతీ కార్యాలయం సమీపంలో తడిచి రంగుమారి బూజుపట్టిన మొక్కజొన్నలను ఆరబెట్టిన దృశ్యం


వరదాకాలం చదువులు: కొల్లూరు మండలం తడికలపూడిలో ఆరబెట్టిన పుస్తకాలు, దుస్తులు

కష్టాల తీరం..జీవనం భారం


ధాన్యం.. దైన్యం: ఆవులవారిపాలెంలో వరదకు తడిచిపోయిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ


తోడేకొద్దీ బురద: కొల్లూరు మండలం తడికలపూడి ఎస్సీ ప్రాంతంలో వరద నీటిని ఆయిల్ ఇంజిన్‌తో తోడుతున్న దృశ్యం

కృష్ణమ్మ ఉగ్రరూపానికి అతలాకుతలమైన తీర ప్రాంత గ్రామాలు నేటికీ వరద ముంపులో కొట్టుమిట్టాడుతున్నాయి. వరద ముంచెత్తడంతో కకావికలమైన కృష్ణా తీర ముంపు గ్రామాల ప్రజలు నేటికీ కష్టాల కడలిలోనే బతుకీడుస్తున్నారు. వరద తగ్గి వారం రోజులు గడిచినా, వర్షాలు వీడకపోవడంతో నీట మునిగిన ఇళ్లను శుభ్రం చేసుకునే వెసులుబాటు సైతం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని తడికలపూడి, కిష్కిందపాలెం, తిప్పలకట్ట తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వరద నీరు తొలగకపోవడంతో నేటికీ ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

– కొల్లూరు


ఆరాలి.. బతుకు సాగాలి: తడికలపూడిలో ఎండు పసుపు కొమ్ములను ఆరబెడుతున్న రైతు కుటుంబం


వరద బురద వదలాలి: తడికలపూడి ఎస్సీ ఏరియాలో ఫ్రిజ్‌ను శుభ్రం చేసుకుంటున్న గృహిణి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

గుంటూరు మెడికల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ప్రాంగణంలో బుధవారం 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కై' నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ఉద్యోగులతో డీఎంహెచ్ఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలిథిన్, వాహనాల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. సైకిల్ వాడటంతో పాటు నడకను అలవరచుకోవాలని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు. సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు పండించాలని, కట్టెలు, బొగ్గు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను కాల్చకూడదని, వాటిని రీసైక్లింగ్‌కు పంపాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ డి.అన్నపూర్ణ, డాక్టర్ వరప్రసాద్, ఏ.జయప్రసాద్, డాక్టర్ ప్రీతి, గిరిధర్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం పంట నష్టం జరిగినట్టేనా?


కొల్లూరు మండలం సుగ్గునలంక వద్ద పంట నష్టాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు



వరదల నష్టం గురించి కేంద్ర బృందానికి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి

- రైతులు, కలెక్టర్‌ను అడిగి అనుమానాలు నివృత్తి చేసుకున్న కేంద్ర బృందం
- వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు వివరణ
- కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్ వెంకట మురళి

కొల్లూరు: కృష్ణా వరదల కారణంగా పంట నష్టం వంద శాతం జరిగినట్టేనా..? భనానా (అరటి) ఆకులు అక్కడక్కడ పచ్చగా కనిపిస్తున్నాయి.. అవి తిరిగి కోలుకుంటాయా..? అని కేంద్ర బృంద సభ్యులు జిల్లా కలెక్టర్, రైతులను అడిగి తమ అనుమానాలు నివృత్తి చేసుకున్నారు. బుధవారం ముగ్గురితో కూడిన కేంద్ర బృందం కృష్ణా పరివాహక లంక గ్రామాలైన సుగ్గునలంక, పెసర్లంక అరవింద వారధి, పెసర్లంక రామన్నపేటలోని దెబ్బతిన్న గృహాలు, కొల్లూరు కరకట్ట దిగువనున్న పెసర్లంక నక్కపాయ వద్ద రహదారి పరిస్థితిలను పరిశీలించి వరదలకు సంభవించిన నష్టాలను వీక్షించారు. సుగ్గునలంకకు చెందిన శీలం రామారావు అనే రైతు పొలాన్ని పరిశీలించిన బృంద సభ్యులు పసుపు సాగుకు అయ్యే పెట్టుబడులు, దిగుబడులు గురించి ప్రశ్నించగా, ఉద్యానవన శాఖ అధికారులు కూలంకషంగా వివరించారు. పెసర్లంక అరవింద వారధి వద్ద వరదల కారణంగా కోతకు గురైన నక్కపాయ గండి అడ్డుకట్టను చూపించి పరిస్థితిని కలెక్టర్ వివరించారు. అనంతరం పెసర్లంక రామన్నపేటలో వరదల కారణంగా దెబ్బతిన్న కొల్లూరు రాధాకృష్ణ మూర్తి కుటుంబాన్ని పరామర్శించి వరద నీటి మట్టం ఎంతవరకు వచ్చిందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వివరాలు నమోదు చేసుకొన్న సభ్యులు పర్యటించిన గ్రామాలలో పరిస్థితులపై పూర్తి నివేదికలు అందజేయాలని కలెక్టర్‌కు సూచించారు. కేంద్ర బృందంలో ఉన్న నాగ్‌పూర్ ఎంఏ డైరెక్టర్ వాఘ్మరే, ఢిల్లీ ఎంఎఫ్ కన్సల్టెంట్ కౌల్, ఢిల్లీ ఎంఆర్‌డీ డిప్యూటీ సెక్రటరీ ప్రదీప్‌కుమార్‌ల వెంట జేసీ ప్రఖర్ జైన్, రేపల్లె ఆర్డీఓ హేలాషారోన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వరదలతో లంక గ్రామాల్లో అపారనష్టం

వేమూరు: కృష్ణా వరదల దెబ్బకు లంక గ్రామాల్లో అపారనష్టమేర్పడిందని, రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా మునిగి పోయాయని బాపట్ల జిల్లా కలెక్టరు వెంకట మురళి తెలిపారు. వేమూరు ఆర్య వైశ్యకల్యాణ మండపంలో బుధవారం జిల్లాలో వరద పరిశీలనకు వచ్చిన కేంద్రం బృందంతో సమావేశం జరిగింది. వరదల వల్ల జరిగిన నష్టం గురించి కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. వేమూరు నియోజకవర్గంలో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె గ్రామాలు వరదల వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వరి 86,658 ఎకరాలకు 32,771 ఎకరాలు దెబ్బతినడం జరిగిందన్నారు. వరద వల్ల లంక గ్రామాల్లో 191 మీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం రూ 382.54 లక్షలకు అంచనా తయారు చేయడం జరిగిందన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, కేంద్ర బృందం సభ్యులు వాక్‌మారే, కౌల్, ప్రదీప్ కుమార్, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓలేరు పల్లెపాలెం కరకట్ట పరిశీలన

ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద 2009లో కృష్ణానది కరకట్టకు పడిన గండిని ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (ఐఎంసీటీ) బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా నాడు పడిన గండి వల్ల రేపల్లె మున్సిపాలిటీ, పేటేరు, భట్టిప్రోలు మండలంలోని కన్నెగంటివారిపాలెం, వెంకట్రాజునగర్ ప్రాంతాలు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయని బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి బృంద సభ్యులకు వివరించారు. పల్లెపాలెం శివారు – రావి అనంతవరం మధ్యలో ఇటీవల వచ్చిన వరదల నేపథ్యంలో కరకట్టకు అడ్డుగా ఇసుక బస్తాలు, బుసక వేసిన ప్రాంతాన్ని కూడా వారు పరిశీలించారు. రివర్ కన్జర్వేషన్ డీఈ భానుబాబు, ఏఈ నాగేశ్వరనాయక్, భట్టిప్రోలు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: బాపట్ల జిల్లాలో వరద ప్రభావానికి వేల ఎకరాల పంటలు పూర్తి పంటనష్టం జరిగిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర బృందం మండలంలోని కనగాల గ్రామంలో ముంపుకుగురైన వరి పొలాలలను బుధవారం పరిశీలించి జరిగిన నష్టాన్ని రైతులను అడిగి వివరాలు నమోదు చేశారు.


ఓలేరు పల్లెపాలెం వద్ద 2009లో గండి పడిన ప్రాంతం గురించి కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి

కేంద్ర బృందానికి వినతిపత్రం..

వేమూరు: వరద ప్రాంతాల పరిశీలకు బుధవారం వేమూరు వచ్చిన కేంద్ర బృందానికి లంక గ్రామ ప్రజల సమస్యలపై సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. వేమూరు ఆర్య వైశ్యకళ్యాణ మండపంలో జరిగిన సమావేశం అనంతరం వినతి పత్రాన్ని సీపీఎం నేతలు అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, నాయకులు టి.కృష్ణమోహన్, వి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రద్దు చేయండి మహాప్రభో..!

కేంద్ర బృందం కాన్వాయ్‌ను అడ్డుకున్న డ్వాక్రా మహిళలు

కొల్లూరు: వరదల వల్ల సర్వం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాం.. కుటుంబాల జీవనమే గగనమవుతుంది.. వరదల నుంచి కోలుకోవాలంటే రుణాలు రద్దు చేయించండి మహాప్రభో.. అంటూ కృష్ణా వరద పీడిత గ్రామాల ప్రజలు కేంద్ర బృందం ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. బుధవారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని సుగ్గునలంక, పెసర్లంక ప్రాంతాలలో వరదల కారణంగా వాటిల్లిన పంట, గృహ, రహదారుల నష్టాలను పరిశీలించేందుకు బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి నేతృత్వంలో కేంద్ర బృందం పర్యటించింది. సుగ్గునలంక ప్రాంతంలో వాణిజ్య పంటల నష్టాలను పరిశీలించి కేంద్ర బృందం వెనుతిరిగి వెళుతున్న క్రమంలో చింతర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు, రైతులు బృంద కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ కాన్వాయ్ ఆగడం కుదరదని ఏమైనా ఉంటే ఆఫీస్‌ల వద్దకు రావాలనడంతో మహిళలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ముందుకు కదిలారు. మహిళలను గమనించిన కలెక్టర్ కారు దిగి సమస్య ఏంటని ప్రశ్నించడంతో, డ్వాక్రా రుణాలు, వ్యవసాయ రుణాలు కట్టలేని పరిస్థితిలోకి వెళ్లామని రుణాలు రద్దు చేయించాలని కోరారు. ఇంతలో కేంద్ర బృంద సభ్యులు మహిళల వద్దకు వెళ్లి వారి డిమాండ్‌లు ఏమిటని జిల్లా అధికార యంత్రాంగాన్ని అడగడంతో రుణాలు రద్దు చేయాలని కోరుతున్నారని వివరించారు. డ్వాక్రా మహిళలు, రైతుల డిమాండ్‌పై స్పందించిన కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి మూడు నెలల పాటు రుణాలు చెల్లించాలని ఒత్తిడి తీసుకురాకుండా ఉండాలని సూచిస్తామని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అయితే మూడు నెలలు రుణాలు చెల్లించకుండా వాయిదా వేస్తే బ్యాంకుల్లో సిబిల్ స్కోర్ తగ్గి తిరిగి రుణాలు తీసుకోవాలంటే ఇబ్బందులు తలెత్తుతాయని డ్వాక్రా మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

రోజుల పసికందును విక్రయించిన కన్నతండ్రి

- బిడ్డను పెంచలేని స్థితిలో నగదు ఆశించి విక్రయం
- గుంటూరు శిశు సంరక్షణ కేంద్రంలో పసికందు

చినగంజాం: కన్న బిడ్డను పెంచడం భారంగా తలచిన ఓ తండ్రి రోజుల పసికందును విక్రయించిన సంఘటన బాపట్ల జిల్లా చినగంజాంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం ప్రకారం చినగంజాం పంచాయతీ జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మి గత నెల 30వ తేదీ చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఆడబిడ్డను ప్రసవించింది. ఆమెకు పుట్టిన బిడ్డ 9వ సంతానం కాగా ఇకపై ఆమెకు బిడ్డలు పుట్టకుండా ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందింది. ఇదిలా ఉండగా భట్టిప్రోలుకు చెందిన మీరాబీ అనే మహిళ తన స్నేహితురాలు ప్రభావతితో కలిసి వచ్చి అదే ఆస్పత్రిలో ఆడబిడ్డను ప్రసవించింది. బిడ్డను 7వ నెలలో ప్రసవించడంతో నెలలు నిండని బిడ్డ మృతి చెందింది. ఆస్పత్రిలో ఉన్న సమయంలో మీరాబీ స్నేహితురాలు ప్రభావతికి, సుబ్రహ్మణ్యం కుటుంబానికి పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో ప్రభావతి తన స్నేహితురాలికి సాయమందించేందుకు మీరాబీకి పుట్టిన బిడ్డ ఇన్‌క్యుబేటర్‌లో ఉంచామని నమ్మించింది. అటు తరువాత సుబ్రహ్మణ్యం కుటుంబ పరిస్థితిని తెలుసుకొని, 9 మంది సంతానం పోషించలేమనే వారి బలహీనతను తెలుసుకొని, పుట్టిన పసికందును వారికి ఇచ్చేలా రూ.1.20 లక్షలకు డీల్ కుదుర్చుకుంది. తన భార్య లక్ష్మి కర్మకాండలు ముగిసిన తరువాత బిడ్డను తీసుకెళ్లేలా వారి మధ్య ఒప్పందం చేసుకొని ఈ నెల 7వ తేదీ శనివారం ప్రభావతి చినగంజాం వచ్చి రోజుల పసికందును తీసుకొని వెళ్లి మీరాబీ చెంతన చేర్చింది. ఆస్పత్రి సిబ్బందికి మీరాబీ బిడ్డ చనిపోయిన సంగతి ముందుగానే తెలిసి ఉండటంతో ఆమె పక్కన ఉన్న బిడ్డ గురించి ఆరా తీశారు. అనుమానాస్పదంగా తోచడంతో ఆస్పత్రి అటెండెంట్‌లు డ్యూటీ డాక్టర్‌కు విషయం తెలియజేయడంతో వారు గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 10 వ తేదీన ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు చినగంజాంకు సంబంధించిన కేసు కావడంతో ఇక్కడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. చినగంజాం ఎస్ఐ ఎస్.రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చినగంజాం జాలమ్మ కాలనీలో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం తన సంతానంతో ఇంటి నుంచి కన్పించకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా చంటి బిడ్డను పోలీసులు గుంటూరు శిశుసంరక్షణ కేంద్రంలో ఉంచినట్లు వారు తెలిపారు. తన సోదరుడు సుబ్రహ్మణ్యం పసిబిడ్డను పెంచలేని స్థితిలో మీరాబీకి ఉచితంగా ఇచ్చారే తప్ప విక్రయించలేదని సోదరి శ్రీలక్ష్మి తెలిపింది.